క్లుప్తంగా

కొనసాగుతున్న వైద్య శిబిరం, సర్వే

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామంలో ఇటీవల డయేరియా వ్యాప్తి చెందడంతో నాలుగో రోజు గురు వారం కూడా గ్రామంలో బొండపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించా రు. గ్రామానికి చెందిన వృద్ధుడు మామిడి ఆదప్పుడు డయేరియా లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించి జిల్లా కేంద్రంలోని మహారాజ కేంద్ర సర్వ జన ఆస్పత్రికి తరలించారు. అలాగే డయేరియా లక్షణాలున్న మరొక వ్యక్తికి గ్రామంలోనే ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యసేవలందించి ఇంటికి తరలించామని డాక్టర్ ఎల్.సత్యనారా యణ తెలిపారు. వైద్య సిబ్బంది 24 గంటలూ గ్రామంలోనే ఉంటూ అవసరమైన వారికి వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు.హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఏ.బాషా, తదితర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గంట్యాడ: కౌమార బాలికలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధి కారి వెంకటేష్ ఆశ కార్యకర్తలకు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌమార బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్య బారిన పడకుండా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ కొండమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

యూపీ స్కూళ్ల రద్దును విరమించుకోవాలి


వలిరెడ్డి రవీంద్ర నాయుడు

చీపురుపల్లి: పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టే మార్పులు విద్యారంగ పరిరక్షణకు దోహదపడేలా ఉండాలి తప్ప పాఠశాల విద్యా వ్యవస్థను నాశనం చేసే విధంగా ఉండకూడదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు తన అభిప్రాయం తెలిపారు. గురు వారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాజాగా ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలల(యూపీ స్కూళ్ల)ను రద్దు చేయడాన్ని పీఆర్‌టీయూ తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా మార్చ డంతో భవిష్యత్‌లో విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడనుందని, ఈ నిర్ణయంతో చాలా పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే ఉన్నత పాఠశాలల్లో 94 మంది విద్యార్థులు దాటిన తర్వాత మూడో సెక్షన్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్న ట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో ప్రైమరీ మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి అందులో ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


పైడిరాజు (ఫైల్)

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కిలారి పైడిరాజు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పైడిరాజు రెండు రోజుల క్రితం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం వేకువ జామున మృతిచెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

శృంగవరపుకోట: రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు స్థానిక ఏజీఎల్ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆకళాశాల కరస్పాండెంట్ ఎస్.రవికిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గంట్యాడ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన పోటీల్లో పురుషుల విభాగంలో విద్యార్థులు ఎం.అచ్యుత్, ఏ.దుర్గాప్రసాద్, మహిళల విభాగంలో పి.సమీర ఉత్తమ ప్రదర్శన కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు ఈ నెల 25 నుంచి 27వరకూ విశాఖపట్నం జిల్లా ఎలమంచిలిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

సూర్య ఘర్ పథకంపై అవగాహన

కొత్తవలస: గృహ అవసరాలకు సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేలా ఇళ్లపై కప్పులపై సోలార్ ప్లేట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా నిధులు మంజూరుచేస్తోందని విద్యుత్ శాఖ డీఈ సురేష్‌బాబు తెలిపారు. మండలంలో దేశపాత్రునిపాలెం గ్రామస్తులకు పీఎం సూర్యఘర్ పథకంపై గురువానం అవగాహన కల్పించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ వినియోగదారులకు రాయితీపై సోలార్ రూఫ్‌టాప్ పరికరాలు అందిస్తున్నామన్నారు. ఇందుకోసం జిల్లాలో అయిదు గ్రామాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. మొదటి ఆరునెలల లోపు వంద సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకున్న గ్రామానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయల నజరాన అందజేయనుందని చెప్పారు. ఏఈ అప్పారావు పాల్గొన్నారు.

బాదుడు షురూ..!

- భూరిజిస్ట్రేషన్ ఫీజుల పెంపునకు రంగం సిద్ధం
- భూములతో పాటు భవన నిర్మాణాల రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా పెంచనున్న ప్రభుత్వం
- ఫిబ్రవరి నుంచి అమలు చేసే యోచనలో సర్కారు


రోళ్లవాకలో రైతులు సాగు చేస్తున్న భూములు

బొండపల్లి:

కూటమి ప్రభుత్వం మరో బాదుడుకు రంగం సిద్ధం చేసింది.అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కనపెట్టి వరుసగా ప్రజలపై మోయలేని భారాలు మోపుతోంది. ఒకపక్క నిత్యావసర ధరలు, కూరగాయల ధర లు ఆకాశాన్నంటుతుంటే.. మరోవైపు విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజల నడ్డివిరిచిన ప్రభుత్వం తాజాగా భూముల మార్కెట్ విలువ రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచేం దుకు సిద్ధమైంది. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు అమలు చేయనున్నట్లు సమాచారం. 2019కు ముందు కూడా టీడీపీ ప్రభుత్వం ఇలాగే భూముల రిజిస్ట్రేషన్ ఫీజులను పెంచి అప్పట్లోనూ ప్రజలపై తీవ్ర భారాన్ని మోపింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ 2019 నుంచి 2024 వరకు ఫీజులను పెంచకుండా పాత వాటినే అమలు చేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ఎన్నికల హామీలను తుంగలో తొక్కి భూముల రిజిస్ట్రేషన్ ఫీజులను భారీగా పెంచి ఫిబ్రవరి 15 నుంచి బాదుడుకు శ్రీకారం చుట్టనుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్‌తో పాటు భవన నిర్మాణ రంగాలు కుదేలయ్యాయి. తాజా నిర్ణయంతో మరింత కుదేలయ్యే ప్రమాదం ఉందని రియల్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

10 నుంచి 15 శాతం పెరిగే అవకాశం

వచ్చే నెల నుంచి ఇప్పుడు ఉన్న భూముల విలువను 10 నుంచి 15 శాతం పెంచనున్నారు. భూముల రిజిస్ట్రేషన్‌తో పాటు భవన నిర్మాణాల విలువను కూడా పెంచనున్నారు. భవన నిర్మాణాలు చేపట్టేవారితో పాటు,భూముల క్రయ విక్రయాలు జరిపే వారిపై ఫీజుల భారం భారీగా పడనుంది. ప్రస్తుతం ఉదాహరణకు ఎకరా భూమి విలువ రూ.20 లక్షలు ఉంటే దీని విలువ 15 శాతం పెంచితే రూ. 23 లక్షలు అవుతుంది. రిజిస్ట్రేషన్ ఫీజును 7.5 శాతం వసూళ్లు చేయనున్నారు. ఈ లెక్కన ఎకరా భూమికి ఫీజు రూ.1,72,500 అవుతుంది. గతం కంటే రూ.22,500 అదనపు భారం పడనుంది. గజపతి నగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాల యం పరిధిలోని గజపతినగరం,మెంటాడ,బొండపలి ల,దత్తిరాజేరు మండలాల్లో సుమారు 26 వేల హెక్టార్ల సాగు భూమితో పాటు 1000 హెక్టార్లలో రియల్ ఎస్టే ట్ వెంచర్లు ఉన్నాయి. రోజూ పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అలాగే కొత్త నిబంధనల ప్రకారం ఆర్‌సీసీ నిర్మాణాల ధరలు భారీగా పెరగనున్నాయి.

ప్రభుత్వ నిర్ణయం సరికాదు



ఇప్పటికే ఈప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులతో పాటు రియల్టర్లూ పూర్తిగా కుదేలయ్యారు. గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజులను పెంచకుండా పాత ఫీజులనే కొనసాగించింది. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాకుండానే రిజిస్ట్రేషన్ ఫీజులు భారీగా పెంచేందుకు సిద్ధం కావడం సరికాదు. అత్యవసరం వచ్చి భూములు అమ్ముకోవాలనుకున్న రైతులతో పాటు కొనాలనుకునే వారికి ఇద్దరిపై కూడా భారం పడుతుంది.

– మహంతి రమణ,
గొట్లాం పీఏసీఎస్ మాజీ చైర్మన్

పునరాలోచన చేయాలి



భూరిజిస్ట్రేషన్ ఫీజులను ఒకేసారి 10 నుంచి 15 శాతం పెంచేలా ప్రభుత్వం ఆలోచన చేయడం తగదు.దీని వల్ల రైతులపై తీవ్రభారం పడుతుంది. అత్యవసరం వచ్చి భూములను విక్రయించాలనుకునే రైతులు నష్టపోతారు.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణాలు చాలా వరకు నిలిచి పోయాయి. ఇకపై మరింత నిలిచిపోయే అవకాశం ఉంది. భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఫీజుల పెంపు విషయంపై పునరాలోచన చేయాలి.

– పురం అప్పారావు, గజపతినగరం
నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి

రోడ్డు పనులు చేపట్టాలని నిరసన



సోంపురం–వేపాడ ప్రధాన రహదారి నుంచి ఆతవ గ్రామానికి వెళ్లే రోడ్డు పునరుద్ధరణ పనులను తక్షణం ప్రారంభించాలని కోరుతూ ఆగ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన ఉద్యమనేత ఆతవ ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కావడంతో పాటు పనులు ప్రారంభమయ్యాయన్నారు.ఎన్నికలకు ముందు మెటల్, క్రషర్ బుగ్గి వేశారని, ఆ తర్వాత పనులు నిలిచిపోయా యని చెప్పారు. రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని ఎన్నికల సమయంలో హామీలిచ్చిన నాయకులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు స్పందిం చి రోడ్డు పనులు ప్రారంభించాలని, లేకుంటే ఈ నెల 27నుంచి ధర్నా చేస్తామని ప్రకటించారు. మాజీ సర్పంచ్ బోను నాగరాజు, దళిత నాయకులు కర్రి దేముడు, దప్పు రాజు, చప్ప నూకరాజు తదితరులు, పాల్గొన్నారు. – వేపాడ

ఓటు.. ప్రజాస్వామ్యానికి పునాది



ప్రజాస్వామ్యానికి ఓటు పునాది అయితే, ఎన్నికలు ఆక్సిజన్ అని ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు సూర్యారావు అన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటర్ల విధులు, బాధ్యతలు తెలియజేస్తూ ఓటరు అక్షరాస్యత వేదిక ముద్రించిన కరపత్రాలను ఎస్.కోటలోని దేవీ జంక్షన్‌లో తహసీల్దార్ ఎం.అరుణకు మారి గురువారం విడుదల చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఓటరూ నిజాయితీగా తన ఓటును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమవంతు సహకారం అందించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. డీటీ సునీత, ఓటరు అక్షరాస్యత వేదిక సభ్యులు వి.సన్యాసప్పడు, ఎల్.సాంబమూర్తి, ఆర్.సూరిదేముడు, వెంకలేశ్వర్లు, డి.ధనుంజయ్ పాల్గొన్నారు. – శృంగవరపుకోట

బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాలు



బాలికలు, మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని పెదమానాపురం ఏఎస్‌ఐ రామారావు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా దత్తిరాజేరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు గురువారం వివిధ చట్టాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలు, బస్సుల్లో, ఎక్కడైనా సరే మహిళలు, బాలికలపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. లైంగిక వేధింపులకు పాల్పడే వారికి కోర్టులు కఠిన శిక్షలు విధిస్తున్నాయని చెప్పారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీస్ సిబ్బంది సందీప్ పాల్గొన్నారు. – దత్తిరాజేరు

జిల్లా వెలమ సంఘం అధ్యక్షుడికి సన్మానం


రామునాయుడును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

కొత్తవలస: జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై న భోజంకి రామునాయుడుని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని తన క్యాంపు ఆఫీస్‌లో వేపాడ మండల వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో గురువారం సన్మానించారు. ఈసందర్భంగా కడుబండి మాట్లాడుతూ వెలమల సంక్షేమానికి, హక్కుల సాధనకై కృషి చేయాలని రామునాయుడికి సూచిం చారు. అనంతరం వేపాడ మండల ప్రజాప్రతినిధులతో కడుబండి సమావేశమయ్యారు.బానాది గ్రామ సచివాలయాన్ని తరలించడాన్ని ఖండించారు.అలాగే పంచాయతీ పరిధిలో చేసిన పనులకు బిల్లుల చెల్లిం పులపై చర్చించారు.డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ శానాపతి అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగన్నాథం, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, వేపాడ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

గజపతినగరం: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న రాష్ట్రంలోని 23వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ బి.సాయికృష్ణ కోరారు. ఈ మేరకు గజపతినగరంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా రీజనల్ సెక్రటరీ అల్లు శంకరరావు, బొబ్బిలి డివిజన్ ప్రెసిడెంట్ రామునాయుడు, పార్వతీపురం సెక్రటరీ ఆర్.సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్, అల్లు పైడిపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో బిల్లుల భారం నివారణ


సోలార్ రూఫ్ టాప్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సోలార్ విద్యుత్‌ను అధికంగా వినియోగించే గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా గుర్తించి కేంద్రప్రభుత్వం బహుమతులు అందజేస్తుందన్నారు. అనంతరం సూర్యఘర్ యోజన పథకం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ సభ్యుడు గారతవుడు, నాయకులు పీవీవీ గోపాలరాజు, జి.గోవిందరావు, ప్రదీప్ కుమార్, విద్యుత్ శాఖ డీఈ శివకుమార్, ఎంపీడీఓ బి.కళ్యాణి, తహసీల్దార్ బి.రత్నకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

శృంగవరపుకోట: మండలంలో తిమిడి గ్రామ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులను ఎంపీపీ సొండి సోమేశ్వరరావు అధ్యక్షతన ఎమ్మెల్సీ రఘురాజు గురువారం ప్రారంభించారు. గంగిరెడ్లపాలెంలో రూ.4లక్షల మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను ప్రారంభించారు. అనంతరం వసి, తిమిడి గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మి, సర్పంచ్ ఒబ్బిన త్రినాథమ్మ, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, ఎంపీటీసీ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటకోత ప్రయోగం


పంటకోత ప్రయోగం చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో రస్తాకుంటుబాయి కృషీ విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు గురువారం వేరుశనగ పంటకోత ప్రయోగం నిర్వహించారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఎస్.ధ్రువ మాట్లాడుతూ వేరుశనగలో టీసీ జీఎస్ 1694 రకం దిగుబడి ఆశాజనకంగా ఉందని, ఎకరానికి 14 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని చెప్పారు. కేవీకే ద్వారా ఇక్కడి రైతులకు టీసీ జీఎస్ 1694 రకం వేరుశనగ విత్తనాలను సిఫార్సు చేయడం జరిగిందని, ఈ రకంలో దిగుబడి ఎక్కువగా ఉంటుందని, అధిక నూనె శాతం ఉంటుందని, గింజ పరిమాణం కూడా ఒకేలా ఉంటుందని, పురుగు, తెగుళ్ల ఉధృతి తక్కువ అని చెప్పారు. కార్యక్రమంలో సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.స్రవంతి, విస్తరణ విభాగం శాస్త్రవేత్త అనంత విహారి, యంగ్ ప్రొఫెషనల్ అనీల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: పట్టణంలోని 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో చీపురుపల్లి పట్టణంతో పాటు పలు గ్రామీణ ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాథరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చీపురుపల్లి టౌన్‌తో పాటు రిక్షాకాలనీ, జి.అగ్రహారం, పిల్లపేట, జగన్నాథ రాజుకాలనీ, ఆంజనేయపురం, వంగపల్లిపేట, కుమ్మరివీధి, విజయాకాలనీ, కొత్తగవిడివీధి, రెడ్డిపేట, రావివలస, విజయరాంపురం, నాగంపేట, కొత్తపేట, పైలపేట, గురానపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గొట్లాం ఫీడర్ పరిధిలో..

బొండపల్లి: గొట్లాం ఫీడర్ పరిధిలోని నెలివాడతో పాటు కెరటాం గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ ఆర్.శంకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గర్భాం సబ్‌స్టేషన్ పరిధిలో..

మెరకముడిదాం: మండలంలోని గర్భాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విదుత్‌శాఖ డీఈ త్రినాథ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ మార్చడంతో పాటు ఇతర మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శతశాతం అక్షరాస్యత సాధిద్దాం


గజపతినగరం: ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక


వేపాడ: వలంటీర్ టీచర్లకు మెటీరియల్ అందజేస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంపీపీ సత్యవంతుడు



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సురేష్

నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం 'ఉల్లాస్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, శతశాతం అక్షరాస్యత సాధనలో వలంటీ ర్ టీచర్లు కీలకపాత్ర పోషించాలని ఎంపీపీలు, ఎంపీడీఓలు కోరారు. చీపురుపల్లి, బొండపల్లి, గజపతినగరం, వేపాడ, గంట్యాడ, దత్తిరాజేరు, గుర్ల, మెరకముడిదాం, గరివిడి మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో వలంటీర్ టీచర్లకు గురువారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంపీడీ ఓలు, ఎంపీపీ లు, జెడ్పీటీసీలు,ఎంఈఓలు మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చేందుకు వలంటీర్ టీచర్లగా వీఓఏలను నియమించిన ట్లు చెప్పారు. ప్రతీ వలంటీర్ కనీసం 10 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలన్నారు. 2025 మార్చి నెలాఖరు నాటికి శతశాతం అక్షరా స్యత సాధించేందుకు సమష్టి కృషి అవసరమని చెప్పారు. అనంతరం వలంటీర్ టీచర్లకు పుస్తకాలు అందజేశారు. వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మెరకముడిదాం: వలంటీర్ టీచర్లకు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు


చీపురుపల్లిరూరల్(గరివిడి): మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం


బొండపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల


గుర్ల: మాట్లాడుతున్న ఎంపీడీఓ శేషుబాబు


దత్తిరాజేరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్


గంట్యాడ: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణమూర్తి

ఘనంగా నేతాజీ జయంతి


చీపురుపల్లి: వంగపల్లిపేట పాఠశాలలో నేతాజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


వేపాడ: సోంపురంఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చీపురుపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను పట్టణంలోని వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

సోంపురంలో..

వేపాడ: సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ ప్రజలను జాతీయోద్యమం వైపు ఆకర్షితులను చేయడంతో పాటు బ్రిటీష్ వారికి సింహస్వప్నమై, స్వాతంత్ర్య పోరాటంలో చురుకై న పాత్ర పోషించారని అన్నారు.

సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో...

చీపురుపల్లిరూరల్(గరివిడి): సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గరివిడి పట్టణంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం నిర్వహించారు.


చీపురుపల్లిరూరల్(గరివిడి): నేతాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, తదితరులు

పట్టణంలోని నేతాజీ విగ్రహానికి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, గరివిడి ఎస్‌ఐ లోకేశ్వరరావు, సహాయ్ సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీను, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకో వాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రమీలకుమార్, సివుకు కాంతారావు, ఉపాధ్యాయులు సత్యశ్రీనివాసరావు,సుదీర్ పాల్గొన్నారు.